క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



టెక్కలి బీసీ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తున్న డిప్యూటీ ఈవో పగడాలమ్మ తదితరులు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తోందని టెక్కలి ఉప విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ అన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. తల్లిదండ్రులంతా వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఆమె మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు కల్పించారు. అనంతరం రెండో విడత నాడు–నేడు పనులను పర్యవేక్షించారు. ఈమెతో పాటు మండల విద్యాశాఖాధికారి జి.నాగభూషణ రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థుల సందడి



ఆటలు ఆడుతున్న పిల్లలు

టెక్కలి: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. అలాగే గ్రంథాలయంలో వివిధ కథల పుస్తకాలను చదివించారు.

రైతులకు అధిక ప్రాధాన్యం



ట్రాక్టర్, పనిముట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయదారులకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పోలేరు రైతుభరోసా కేంద్రం పరిధిలోని సీహెచ్‌సీ గ్రూపు ద్వారా రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లను 40 శాతం సబ్సిడీతో పాలపోలమ్మ గ్రూపు సభ్యుల సమక్షంలో మంగళవారం ప్రారంభించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లద్దు కేశవపాత్రో, జేసీఎస్ మండల కన్వీనర్ కె.సురేష్, నాయకుడు బల్ల తిరుపతి పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మెన్‌కు ఆర్థిక సాయం



మురళికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీడీవో ఉమాసుందరి

సంతబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామ సచివాలయంలో జేఎల్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కాశీ మురళి అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆయనకు అండగా నిలిచేందుకు మండల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ముందుకొచ్చి విరాళాలు సేకరించారు. రూ. 25, 300 సేకరించి ఎంపీడీవో గురువెల్లి ఉమాసుందరి ద్వారా మురళికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో విస్తరణాధికారి హనుమంతు శశిభూషణరావు, పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే నౌపడ సచివాలయ సిబ్బంది విద్యుత్ షాక్‌తో చనిపోయిన సీతానగరం వాసి బి.రామారావుకు 15 వేల రూపాయలను స్థానిక సర్పంచ్ పి.బృందాదేవి చేతులు మీదుగా అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ పి.రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నారాయణరెడ్డి సేవలు నిరుపమానం



నారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తిప్పన నారాయణరెడ్డి సేవలు నిరుపమానమని ఎమ్మెల్సీ నర్తు రామారావు కొనియాడారు. టి.బరపురం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా.. సంతాప సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, వైస్ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ‘జగనన్నకు చెబుదాం’

- కవిటి మండల ప్రత్యేకాధికారి అలివేలుమంగమ్మ



కవిటి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సూచనలిస్తున్న అలివేలుమంగమ్మ

కవిటి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు మనమంతా సమాయత్తం కావాలని కవిటి మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో పి.అలివేలు మంగమ్మ అన్నారు. కవిటి మండల పరిషత్ కార్యాలయంలో లైజనింగ్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జగనన్నకు చెబుదాం విభాగానికి సంబంధించి 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు సంక్షేమ పథకాలు అందుకోవడం, రెవెన్యూ, ఆరోగ్యశ్రీ పథకం వర్తింపులో తలెత్తుతున్న సమస్యలు, ప్రభుత్వశాఖలతో నిర్వహిస్తున్న కార్యకలాపాల్లో ఇబ్బందులు తదితర ఆరురకాల అంశాలకు సంబంధించిన సమస్యలను తెలియజేయవచ్చునన్నారు. అనంతరం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, సచివాలయాల పనితీరు, ఆర్బీకేల్లో సేవలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో శివాజీపాణిగ్రాహి, ఎంఈవో ధనంజయమజ్జి, ఏపీవో కడియం భాస్కరరావు, మండల పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.శిరీష పాల్గొన్నారు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

సంతబొమ్మాళి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కొత్త కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో గురువెల్లి ఉమాసుందరి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో భాగంగా సీఎం లైవ్ ప్రోగ్రాన్ని మంగళవారం తిలకించారు. ప్రతి వినతి పరిష్కారమయ్యే వరకు ట్రాకింగ్ చేయడమే లక్ష్యంగా కొత్త పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. టోల్‌ఫ్రీనంబర్ 1902కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చునన్నారు. కార్యక్రమంలో నౌపడ ఏఎస్సై మెట్ట చంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నాయకులు, అధికారులు వీక్షించారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, ఎంపీడీవో నిశ్చల, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, ఎస్ వినోద్ తదితరులు ఉన్నారు. రానున్న రోజుల్లో ఈ కార్యక్రమం ద్వారా వచ్చే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.



సంతబొమ్మాళి: సీఎం జగన్ లైవ్ ప్రోగ్రాన్ని వీక్షిస్తున్న ఎంపీడీవో ఉమాసుందరి తదితరులు



కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి జగన్ ప్రసంగాన్ని వింటున్న దృశ్యం

స్వేచ్ఛావతి అమ్మవారికి మారిటైమ్‌బోర్డు చైర్మన్ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న వెంకటరెడ్డి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్‌బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి (కేవీఆర్) మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన్ని దుశ్శాలువతో సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

అమ్మవారి దర్శనం అనంతరం పట్టణంలోని రోటరీ ఫంక్షన్ హాల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఇచ్ఛాపురంలో నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో రూ. 750 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జిల్లాలోని తీరప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. బారువ బీచ్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇచ్ఛాపురంలో వైఎస్సార్‌సీపీ టిక్కెట్ ఎవరికి వచ్చిన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు



మంత్రి అప్పలరాజుకు లేఖ అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలాసలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. క్లినిక్‌ల్లో తాము చేస్తున్న విధులకు సంబంధించిన వివరాలను ఆయనకు లేఖ రూపంలో అందించారు. ఉద్యోగులకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో పలాస ఏపీఎన్జీవో అధ్యక్షుడు బోనెల గోపాలరావు, ఎంఎల్‌హెచ్‌పీఎస్ మౌనిక, పావని తదితరులు ఉన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ నెల పది నుంచి 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 11వ తేదీ ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగా.. రోస్టర్ ప్రకారం వంద సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. జూన్ 16వ తేదీన మెరిట్ లిస్ట్ ప్రకటిస్తామని, 18వ తేదీన ఎంపికైన వారి జాబితా వెల్లడిస్తామన్నారు. 19వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలనతోపాటు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడతామన్నారు. జూన్ 21వ తేదీ నుంచి తరగతులు మొదలవుతాయన్నారు. అదనపు సమాచారం కోసం 08947–294094, 99859 75684, 83744 33269 నంబర్లను సంప్రదించాలన్నారు.

సోంపేట: సోంపేట పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు కాపీలను పాఠశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. జూన్ 11న పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్ష రుసుం బీసీ, ఓసీలు రూ. 150 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించాలన్నారు.

రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి



నల్లబొడ్లూరులో కోల్డ్‌స్టోరేజ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖాధికారులు

- ఉద్యానవనశాఖ అధికారి రత్నాచార్యులు

మందస: ప్రభుత్వ అందిస్తున్న పథకాలతో ఉద్దానం రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని అమరావతి ఉద్యానవనశాఖ కమిషనర్ కార్యాలయం సీనియర్ ఆఫీసర్ ఎస్వీ రత్నాచార్యులు (ఏడీ) అన్నారు. మందస మండలంలోని బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరులో మంగళవారం ఉద్దానంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రాయితీతో పలు పథకాలను రైతులకు అందజేస్తోందన్నారు. ఉద్దానంలో నిర్మిస్తున్న కలెక్షన్స్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోలార్ సిస్టమ్స్‌తో కోల్డ్ కేంద్రాలను నిర్మిస్తున్నామన్నారు. వ్యవసాయంతో పాటు అగ్రి బిజినెస్‌ను రైతులు చేసుకోవాలని సూచించారు. చక్కని ప్రణాళికతో పంటలు పండించుకుంటే దిగుబడి పొందవచ్చన్నారు. విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు గ్రామాల్లో పర్యటించి, రైతులకు నిర్దేశాలు చేయాలన్నారు. తెగుళ్ల సమయంలో రైతులను చైతన్య పరిచి, పంట నష్టనివారణ చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఆర్.వి.వి.ప్రసాద్, ఉద్యానవనశాఖ అధికారి సీహెచ్ శంకర్‌దాస్(పలాస), ఎఫ్‌పీఓ సీఈఓ భాగ్యలక్ష్మి, ఉద్దానం ఎఫ్‌పీఓ బోర్డు డైరెక్టర్స్, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్సులను ఆధునికీకరించాలని విజ్ఞప్తి



తిరుమలరావుకి వినతి పత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న ఆర్టీసీ కాంప్లెక్సుల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ కోరారు. ఈమేరకు ఏపీఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మన్ సీహెచ్ డి.తిరుమలరావు విజయవాడలోని తన కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, కంచిలి ఆర్టీసీ కాంప్లెక్సులను ఆధునికీకరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ కాంప్లెక్సు ఆవరణలో కమర్షియల్ షాపులు ఏర్పాటు చేయడం, మౌలిక వసతులు కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు హామీ ఇచ్చారని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

తక్షణ సాయం అందజేత



సాయాన్ని అందజేస్తున్న ఎంపీపీ పుష్ప

ఇచ్ఛాపురం రూరల్: అరకబద్ర గ్రామానికి చెందిన రాపాక పరుశురాం రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన వైఎస్సార్ బీమా పాలసీదారుడు కావడంతో తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని అతని కుటుంబ సభ్యులకు ఎంపీపీ బోర పుష్ప మంగళవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రంగాల కృష్ణారెడ్డి, మంగి హేమావతి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత బారువ

సోంపేట: పల్లిగొల్లగండి పంచాయతీలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారంతో ముగిసింది. బారువకు చెందిన మైత్రీ జట్టు విజేతగా నిలవగా ద్వితీయ స్థానాన్ని పల్లి గొల్లగండి జట్టు సాధించింది. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 11 వేలు, ఐదు వేల రూపాయల నగదుతోపాటు మెమెంటోలను గ్రామ సర్పంచ్ నాగం భాస్కరరావు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్ర మాధవరావు, సానా రాజేష్ కన్నా, వనిమిన భాస్కరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాళీమాతకు పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట: ఎకువూరు గ్రామంలో కాళీమాత అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్సీ నర్తు రామారావు కాళీమాతను మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గొల్లూరు సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, పలువురు నాయకులు ఉన్నారు.

19వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీలోని 19వ వార్డులో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులను అధికారులు చేపట్టారు. జీడి కార్మికులు అధికంగా నివాసం ఉన్నటువంటి ఐటీఐ నగర్, కొండమ్మతల్లివీధి, తిలక్‌నగర్ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తచెదారాలను మున్సిపల్ జేసీబీతో తొలగించారు. పనులను వార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధికారి ప్రతినిధి శిష్టు గోపి, నాయకులు కోనారి ఆది, గజ్జి బాలయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చక్రి, మార్పు చిన్నా, సీపాన ఈశ్వరరావు పర్యవేక్షించారు.

కాలువ పనులకు శంకుస్థాపన

కాశీబుగ్గ: పారిశుద్ధ్య పనులు చేయడంలో అలసత్వం వహించరాదని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. పదోవార్డు పరిధి పెంటపోలమ్మ ఆలయం సమీపంలో సీసీ కాలువ పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సాధారణ నిధులు రూ. 1.50 లక్షలతో కాలువలను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శర్వాన గీత, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శర్వాణ రవికుమార్, బడగల మధు, ఉమా మున్సిపల్, సచివాలయ అధికారులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వడదెబ్బపై విస్తృత ప్రచారం

కోటబొమ్మాళి: వడదెబ్బ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఎండాకాలంలో వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలను పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతిఒక్కరికీ లబ్ధి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- భేతాళపురంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరిందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఉద్దానం ఉద్యానవనంగా మారిందన్నారు. ఉద్దాన ప్రాంతమైన భేతాళపురం పంచాయతీలో మంగళవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దానం అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. గత పాలకులు ఉద్దానాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక కిడ్నీవ్యాధికి పరిశోధన కేంద్రం, ప్రతీ ఇంటికీ శుద్ధజలం, అందుబాటులోకి డయాలసిస్ కేంద్రాలు, రోగులకు పింఛన్ల పెంపు, ఆస్పత్రులకు తీసుకెళ్లడానికి అంబులెన్స్‌లు ఇలా.. ఎన్నో సదుపాయాలు కల్పించారన్నారు. జగనన్న పాదయాత్రలో ఈ ప్రాంతీయుల కష్టాలను కళ్లారా చూశారన్నారు. దీంతో ప్రజల కష్టాలు తీరుస్తున్నారని చెప్పారు. రహదారులు, వంతెనలు, ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు, నాడు–నేడు పనులతో పాఠశాలల ఆధునీకరణ తదితర సంక్షేమ పథకాలతో ఉద్దానం రూపురేఖలు మారాయన్నారు. ఇంటింటికీ వెళ్లిన మంత్రి సీదిరి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. వారు అందుకున్న సంక్షేమ పథకాలు, వాటి ఆవశ్యకతను తెలియజేశారు. ఏయే కుటుంబం ఎంతమేరకు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిందో పథకాల పేర్లతో సహా వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ మామిడి సింహాద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీటీసీ సభ్యుడు సూరాడ వాసు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అందాల శేషగిరిరావు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, డీటీ కె.విజయలక్ష్మి, వ్యవసాయాధికారి జి.నాగరాజు, పంచాయతీ ఏఈ కణితి కృష్ణారావు, మందస వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావు, ఏపీఎం గొడబ ప్రసాదరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు చినవంక గ్రామ నాయకుల వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ విజయకు లేఖ అందజేస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: చిన్నవంక గ్రామ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామంలో తన స్వగృహంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని గుల్లలపాడులో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ. పది లక్షలు మంజూరు చేయాలని మంత్రి సీదిరి అప్పలరాజు ఇచ్చిన సిఫార్సు లేఖను ఆమెకు అందజేశారు. దీనికి చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించి రూ. 5 లక్షలు మంజూరు చేయడానికి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో చినవంక గ్రామ పంచాయతీ సచివాలయ కన్వీనర్ బగాతి శ్రీకాంత్, గుల్లలపాడు బూత్ కన్వీనర్ బగాతి గణేశ్వరరావు, గృహసారథి దువ్వాడ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న బాలరాంరెడ్డి

పలాస: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (ఎస్ఈబీఐ) ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్ స్పెషలిస్టు డాక్టరు బి.బాలరాంరెడ్డి అన్నారు. పలాస మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల పొదుపులు చేస్తూ జీవనోపాధులు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ మధ్య కొన్ని సంస్థలు, కొంతమంది వ్యక్తులు ఆర్థిక పరమైన మోసాలు చేస్తున్నారని.. వాటి ఉచ్చులో పడవద్దని అవగాహన కల్పించారు. ఏపీఎం బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో 25 గ్రామ సంఘాల అధ్యక్షులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి, సుగుణమ్మ, వరలక్ష్మి, డ్వాక్రా ఈవో అప్పలనరసమ్మ, సీసీ వెంకటేశ్వరరావు, రేణుక, నాగమ్మ, కల్యాణి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- సోంపేటలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త సాయిరాజ్

సోంపేట: మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీలోని రెండో సచివాలయం పరిధిలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’కార్యక్రమాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాయిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే రేషన్‌కార్డు వారీగా చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అనేక పరిశ్రమలు నెలకొల్పుతున్నారన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడడానికి విద్య, వైద్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఏఎంసీ మాజీ చైర్మన్ రజనీకుమార్ దొలాయి, ఉపసర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి
- టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులంతా భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో టెక్కలి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి జిల్లా టాపర్స్‌గా నిలిచిన విద్యార్థిని, విద్యార్థులను స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. పాతపట్నం ప్రభుత్వ పాఠశాల నుంచి 594 మార్కులు సాధించిన మిట్టు మహాపాత్రో, సారవకోట కేజీబీవీ నుంచి 590 మార్కులు సాధించిన ఉర్లాన జాహ్నవి, టెక్కలి ఏపీ ఎంజేపీ నుంచి 581 చొప్పున మార్కులు తెచ్చుకున్న తెంబూరు చాందిని, ధర్మాన సేవిత తదితర విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని చదువులో బాగా రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రో డిప్యూటీ కలెక్టర్ అంబ్రీష్, ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, మండల విద్యా శాఖాధికారి జి.నాగభూషణరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: ఉత్తీర్ణులైన విద్యార్థులతో సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో బూర్జపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణులయ్యారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం సంబరాలు నిర్వహించుకున్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు సత్యప్రభ రూ.2 వేలు, వెయ్యి రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, ప్రధానోపాధ్యాయుడు నర్తు గంగయ్య, ఇంజినీరింగ్ సహాయకులు సల్లా నవీన్, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.